1
నవతెలంగాణ
మెదక్
మంగళవారం | 23 జనవరి 2024 | www.navatelangana.com

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ముగ్గురు ఎంపిక



నవ తెలంగాణ - సిద్దిపేట

టెన్నికాయిట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం వారి ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ మున్సిపల్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపికలలో అండర్ 18 జూనియర్స్ బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లా నుండి సృజన, సంజన, బాలుర విభాగంలో ఆకాష్ అత్యంత ప్రతిభ కనబరిచి టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాటం శ్రీనివాస్, క్యాతం రాజకుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వీరికి శిక్షకులుగా వెంకటేష్ వ్యవహరించారన్నారు. ఫిబ్రవరి 6 నుండి 10 వరకు రాజస్థాన్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు పాల సాయిరాం, జిల్లా యువజన క్రీడాధికారి నాగేందర్, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ పన్యాల రామేశ్వర్ రెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాస్, టెన్నికాయిట్ శాశ్వత అధ్యక్షులు ఎండి ఫక్రుద్దీన్, ఉపాధ్యక్షులు తుమ్మ కనకయ్య, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ యతి రాజు, అసోసియేషన్ కార్యదర్శి గుండి ప్రవీణ్, శిక్షకుడు వెంకటేష్‌ను, క్రీడాకారులను అభినందించారు.

ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడిస్) గరిమా అగ్రవాల్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా నలుమూలల నుంచి బాధితులు ప్రజావాణిలో 16 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఎ పిడి జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల ప్రాంత చెరువులు నింపాలి



నవతెలంగాణ-చేర్యాల

కొమురవెల్లి మండలంలోని తపస్ పల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల ప్రాంత చెరువులు నింపాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేర్యాల మండల కేంద్రంలో సోమవారం కార్యకర్తలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ తపాస్ పల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల ప్రాంత చెరువులు, కుంటలు నింపాలన్నారు. చేర్యాల మెట్ట ప్రాంతం కావడంతో ఈ ప్రాంత చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయి పంట పొలాలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తపాస్ పల్లి రిజర్వాయర్ నీటిని చేర్యాల ప్రాంత రైతాంగానికే అందించాలి తప్ప అక్రమంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు తమ ప్రాంతాలకు తరలించుకుపోయారని విమర్శించారు. ఇప్పటికైనా చేర్యాల ప్రాంత రైతుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పందించి తపాస్ పల్లి రిజర్వాయర్ నీరు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చూడాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, నాయకులు జంగిలి యాదగిరి, తిగుల్ల కనకయ్య, ఎస్. బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నవతెలంగాణ



నవతెలంగాణ - గుమ్మడిదల

నిరంతరం సమస్యలను వెలికి తీస్తూ పరిష్కారానికి నవతెలంగాణ దినపత్రిక కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గుమ్మడిదలలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మండల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి సమస్యలను వెలికి తీసి ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లాలని సూచించారు.

పత్రికలు వారధిగా పని చేయాలి



నవతెలంగాణ-బెజ్జంకి

పత్రికలు ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను నిర్భయంగా నిష్పక్షపాతంగా వెలుగులోకి తెచ్చి పరిష్కరించడానికి ప్రభుత్వాధికారులకు, పాలకులకు వారధిగా పని చేయాలని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్ నియోజకవర్గ ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నవతెలంగాణ దినపత్రిక మరింత దీటుగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,యువజన మండలాధ్యక్షుడు మంకాల ప్రవీన్,నాయకులు రంగోని రాజు,శెట్టి రాజు,కత్తి రమేశ్,శానగొండ శరత్,పర్శ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంత్రి సీతక్కను కలిసిన మంత్రి పొన్నం



నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను తన చాంబర్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి వినతిపత్రం అందజేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ సమస్యలపై మంత్రి సీతక్కతో చర్చించారు.

తూమ్ లీకేజీపై మంత్రి పొన్నం ఫిర్యాదు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలోని ఊర చెరువు తూము లీకేజీపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కాశపోయిన రవి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా చెరువు పూడికతీత, కట్ట, తూము నిర్మాణం జరిగిందని అన్నారు. దీనికోసం కోటి 20 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగిందని, అట్టి డబ్బులను ఖర్చు చేసి నాణ్యత లేకుండా తూముకు తలుపులు బిగించారని తెలియజేశారు. ఆ తలుపులు సరిగా లేక చెరువులో నీరు వృధాగా పోతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ కు విన్నవించారు. ఈ విషయంపై ఎన్నిసార్లు ఇరిగేషన్ అధికారులకు, స్థానిక నాయకులకు తెలియజేసిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఫిర్యాదు అందుకున్న మంత్రి సానుకూలంగా స్పందించి తూము తలుపులను సరిగ్గా నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మంత్రి సీతక్కను కలిసిన షేక్ అలీ



నవతెలంగాణనర్సాపూర్

హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ఆమె క్యాంప్ కార్యాలయంలో సోమవారం శివంపేట మండలానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు షేక్ అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో నిరుపేద ప్రాణం బలి





నవతెలంగాణ-రామాయంపేట

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిరుపేద ప్రాణం బలి అయిందని మాజీ వార్డు సభ్యులు, మా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చంద్రప్రతాప్ చిన్న తీవ్రంగా ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నుండి రామయంపేటకు బతుకుదెరువు కోసం వచ్చిన పిట్ల మనోహర్ (63) ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, అనారోగ్యంతో బాధపడుతున్న మనోహర్‌ను సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు రామయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారని తెలిపారు. ఆ సమయంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారన్నారు. మూడు గంటలకు ఆసుపత్రికి వెళ్ళిన వెంటనే ప్రైవేటు అంబులెన్స్‌ల ఓనర్‌లు వచ్చి వాలారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగి బంధువుల వద్ద డబ్బులు ఏమీ లేకపోవడంతో, తానే స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రభుత్వ అంబులెన్స్‌ను పిలిపించాలని డాక్టర్లపై ఒత్తిడి చేశానని తెలిపారు. ఈ క్రమంలో సుమారుగా రెండు గంటల సమయం వృధా అయ్యిం దన్నారు. ప్రభుత్వ అంబులెన్స్‌లో సిద్దిపేటకు తీసుకెళ్లాలని రోగి బంధువులు కోరగా, కామారెడ్డికి తీసుకెళ్లారన్నారు. తీవ్ర అస్వస్థలో ఉన్న మనోహర్ కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆలస్యం అయి, మనోహర్ మృతి చెందారన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

దుబ్బాక మున్సిపల్‌లో అసమ్మతి గళం

- చైర్మన్‌గిరి కోసం బేరసారాలు
- పావులు కదుపుతున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి
- ఎమ్మెల్యే మాటను ఖాతరు చేయని వైనం



నవ తెలంగాణ- దుబ్బాక

దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డికి వ్యతిరేకంగా కొందరు కౌన్సిలర్లు అసమ్మతి గళమెత్తారు. ప్రస్తుత చైర్మన్‌పర్సన్‌ను తప్పించి తమలో ఒకరిని చైర్ పర్సన్‌గా ఎన్నుకోవాలన్న పంతంతో కొన్ని రోజులుగా సుమారు 15 మంది కౌన్సిలర్లు పలుమార్లు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి అవిశ్వాస విషయం వివరించారని తెలిసింది. పురపాలిక కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి 'చైర్మన్ గిరి' కోసం పావులు కదుపుతున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. చైర్మన్ పీఠంపై కన్నేసిన ఆయన మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ముగిసేలోగా ఎలాగైనా సరే చైర్మన్ పీఠాన్ని అధిరోహించాలన్న పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. కొన్నాళ్లుగా ప్రస్తుత చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ పలువురు కౌన్సిలర్లకు ఆ ప్రభుత్వ ఉద్యోగి గాలం వేస్తూ బేరసారాలు సాగిస్తున్నారని దుబ్బాకలో చర్చించుకుంటున్నారు. అవిశ్వాసం పంచాయితీ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దగ్గరికి వెళ్లింది. తన మాటను ఖాతరు చేయడం లేదని ఆ ఉద్యోగి, పలువురు కౌన్సిలర్లపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డట్లు బీఆర్ఎస్ వర్గాల ద్వారా తెలిసింది. గతంలోనూ పలుమార్లు అవిశ్వాసానికి తెరలేపిన ఆ ఉద్యోగిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సముదాయించారు. పార్టీ పరువు పోతుందని, అవిశ్వాసం వద్దని పలుమార్లు నచ్చజెప్పారు. అందరూ సమన్వయంతో దుబ్బాక అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అయినా పీఠంపై ఆశ వదులుకోవడం ఇష్టంలేని ఆయన ఇప్పటికే కొందరు కౌన్సిలర్లకు కొంత మొత్తంలో నగదును ముట్టజెప్పారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత చైర్మన్‌ను ఇరకాటంలో పెడుతూనే 'చైర్మన్ గిరి' కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దుబ్బాక ఉప ఎన్నికల్లో పార్టీ పరాభవం, కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్ల తీరుపై ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత అంశాలు దుబ్బాకలో బీఆర్ఎస్ పార్టీని బలహీనపరచడానికి పునాదులవుతున్నాయని రాజకీయ విశ్లేషణకులు అంటున్నారు. మూడేళ్లుగా నియోజకవర్గ ఇన్చార్జిగా ఉంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంపై నేటికీ పట్టు సాధించలేకపోయాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీని చక్కదిద్దడంలో, నాయకులను సమన్వయ పర్చడంలో ఎమ్మెల్యే విఫలమైనట్లు పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

భారత్ జోడో యాత్రను అడ్డుకోవడం సిగ్గుచేటు



నవతెలంగాణ-నర్సాపూర్

దేశ ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రను అడ్డుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్ పార్కులో గల అంబేద్కర్ విగ్రహం ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ను అస్సాంలో బీజేపీ నాయకులు అడ్డుకోవడంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రజలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రను బీజేపీ నాయకులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. ఇక ఎవరైనా ప్రజల కోసం చేస్తున్న యాత్రను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. దేశ ప్రజల కోసం ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, సురేష్ నాయక్, శ్రీశైలం యాదవ్ ,రిజ్వాన్ ,ఉదయ్, రామా గౌడ్, ఎద్దు మల్లేష్ యాదవ్, దొంతి రవి,, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా, గంజాయి రహిత జిల్లాగా సంగారెడ్డిని తీర్చిదిద్దాలి

- అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహా



నవతెలంగాణ-సంగారెడ్డి

గుడుంబా, గంజాయి రహిత జిల్లాగా సంగారెడ్డిని తీర్చిదిద్దాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి సి.దామోదర రాజనర్సింహ తన క్యాంపు కార్యాలయంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో సంగారెడ్డి జిల్లాలో గంజాయి, గుడుంబా నిర్మూలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా, గంజాయిలాంటి మత్తు పదార్థాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో గుడుంబా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టాలన్నారు. ఇందుకు బాధ్యులైన అక్రమార్కులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గుడుంబా, గంజాయి నిర్మూలనపై ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని సంగారెడ్డిని గుడుంబా, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ హరికిషన్, సహాయ కమిషనర్ రఘురాంలు పాల్గొన్నారు.

వడ్డేపల్లి పెత్తందారులను అరెస్టు చేయాలి



నవ తెలంగాణ హత్నూర

పరిశ్రమకు పర్మిషన్ ఇచ్చారనే సాకుతో వడ్డేపల్లి దళిత మహిళ సర్పంచ్ ముఖగల స్వరూపపై అగ్రకుల పెత్తందారులు దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐఎస్ఎస్‌డి రాష్ట్ర ఉపాధ్యక్షులు దళిత రత్న సాయమొల్ల నర్సింగ్ రాజ్ అన్నారు. హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామంలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన అగ్రకుల పెత్తందారులు దళిత మహిళ సర్పంచ్ ముక్కగల్ల స్వరూపను గ్రామ సంతకు పిలిచి దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా దళిత రత్న సాయమొల్ల నర్సింగ్రాజ్ మాట్లాడుతూ పరిశ్రమలు పెట్టాలంటే వివిధ ప్రభుత్వ డిపార్ట్మెంట్ల అనుమతులు ఇస్తేనే సాధ్యమవుతుందని, ఇవన్నీ తెలిసిన పెత్తందారులు అమాయకమైన దళిత మహిళ సర్పంచ్‌పై దౌర్జన్యం చేయడం ఏంటని ప్రశ్నించారు. పరిశ్రమ వద్దు అనుకుంటే ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చి అనుమతులను రద్దు చేయించుకోవాలన్నారు. అమాయకమైన మహిళా సర్పంచ్‌పై దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. దౌర్జన్యం చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. దళిత మహిళకు రక్షణ కలిపించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువ జన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల మల్లేశం, నర్సాపూర్ నర్సిములు, జనార్దన్ గౌడ్, నర్సాపూర్ ఇంచార్జి సారా రావిగౌడ్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహా ఘటాన్ని తిలకించేందుకు బారులు తీరిన భక్తులు



నవతెలంగాణ కొమురవెల్లి

కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన పెద్ద పట్నం వేడుక సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మల్లన్న శరణు శరణు అంటూ జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగిపోయింది. కన్నుల పండువగా జరిగిన మల్లన్న కళ్యాణాన్ని తిలకించడానికి భక్తులు బారులుతీరారు. శివ శక్తులు శివాలెత్తి పోయారు. హైదరాబాద్ ఒగ్గు పూజారులు ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పెద్ద పట్నం అగ్నిగుండాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.పట్నం వారం మహా ఘటం అయిన (పెద్ద పట్నం)మల్లన్న కళ్యాణాన్ని తిలకించడానికి భక్తులు బారులుతీరారు. శివ శక్తులు శివాలెత్తి పోయారు. హైదరాబాద్?కు చెందిన యాదవుల ఆధ్వర్యంలో ఆలయ తోటబావి ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా మల్లన్న పెద్ద పట్నం అగ్ని గుండాలు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ గర్భగుడి నుంచి ఆలయ ప్రధాన అర్చకులు మల్లన్న దేవుని ఉత్సవ విగ్రహాలతో తోటబావి వద్దకు చేరి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఇక అష్టదిక్కులలో నిమ్మకాయలు, గుమ్మడికాయలతో బలిహరణ చేసి పెద్ద పట్నం పైకి ఆవాహనం చేశారు అనంతరం భక్తులు శివ సత్తులు పెద్దపట్నం తొక్కుతూ అగ్నిగుండాలు దాటారు. ఒక్కసారిగా మల్లన్న శరణు శరణు అంటూ జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగిపోయింది పెద్ద పట్నం తిలకించిన భక్తులు ఆనంద తన్మయత్వం తో ఊగిపోయారు. శివసత్తుల చిందులతో, పోతరాజుల వీరంగాలతో ఆలయ ప్రాంగణమంతా మల్లన్న శరణుఘోషతో మార్మోగింది. మమ్ములను మా పిల్ల పాపాలను చాలంగా చూడు స్వామి అంటూ భక్తులు స్వామి వారి వేడుకున్నారు. ఈ వేడుకలలో దేవాలయ ఈవో బాలాజీ,పాలకమండలి చైర్మన్ లక్ష్మారెడ్డి సభ్యులు ఆలయ అధికారులు పోలీస్ సిబ్బంది అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్ మల్లారెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసిపి సతీష్, ట్రాఫిక్ ఏసిపి ప్రసన్న కుమార్, ఎస్బి ఏసిపి రవీందర్ రాజు, చేర్యాల సిఐ సత్యనారాయణ రెడ్డి, కొమరవెల్లి ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ వివాదాస్పదం

సర్పంచ్ పై అధికారులకు ఫిర్యాదు





నవ తెలంగాణ జిన్నారం

జిన్నారంలో మాజీ ఎంపీపీ అధ్యక్షులు స్వర్గీయ పడకంటి వెంకటేశం గుప్త విగ్రహావిష్కరణ వివాదాస్పదంగా మారింది. సర్పంచ్ అంతరెడ్డిగారు లావణ్య శ్రీనివాస్‌రెడ్డిపై ప్రతిపక్షాలు తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ విజయరావు, గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీకాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి గుట్టు చప్పుడుకాకుండా సర్పంచ్ అంతరెడ్డి గారి లావణ్య శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం కోసం శంకుస్థాపన చేసిన స్థలంలో ఆదివారం అర్ధరాత్రి మాజీ ఎంపీపీ పడకంటి వెంకటేశం గుప్త విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఉదయం లేచి చూసి గ్రామస్తులు విస్తుపోయారు. రాత్రికి రాత్రి విగ్రహం ఏర్పాటుపై మండిపడ్డారు. అందరి సహకారంతో మాజీ ఎంపీపీ విగ్రహాన్ని ప్రారంభించుకోవాల్సి ఉండగా అర్ధరాత్రి ప్రారంభించడం ఏంటని ప్రతిపక్ష నాయకులు, గ్రామస్తులు, వార్డు సభ్యులు మండిపడ్డారు.

అధికారులకు ఫిర్యాదు.

అర్ధరాత్రి విగ్రహం ఏర్పాటుపై ప్రతిపక్షాలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాములు, ఎస్ఐ విజయకుమార్‌లకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ స్థలంలో వెంకటేశం గుప్త విగ్రహం పెట్టడం ఏంటని, ఎవరికి తెలియకుండా ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. వెంటనే విగ్రహాన్ని తొలగించాలని మాజీ ఎంపిటీసీ పుట్టి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు నరేష్, నరేందర్ గౌడ్, బిజెపి నాయకులు రాజిరెడ్డి డిమాండ్ చేశారు.

విగ్రహాన్ని తొలగించిన అధికారులు

పోలీసు బందోబస్తు మధ్య అర్ధరాత్రి సర్పంచ్ అంతరెడ్డిగారి లావణ్య శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించిన విగ్రహాన్ని అధికారులు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రమాకాంత్, తహసీల్దార్ రవి కుమార్‌లు ఎస్ఐ విజయ్ కుమార్ పోలీసు బందోబస్తు మధ్య విగ్రహాన్ని పంచాయతీ సిబ్బంది, క్రైన్ సహాయంతో తొలగించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శ్రీరామ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆకు చిత్రంలో అయోధ్య మందిరమును కనులకు కట్టినట్లు చిత్రించారు. విద్యార్థులు శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతాదేవి, ఆంజనేయుని వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవి, డైరెక్టర్ వేల్పుల శ్రీనివాస్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్దిపేట తంజీమ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట తంజీమ్ ఉల్ మస్జిద్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జియఉద్దీన్ ఆసీఫ్, ఉపాధ్యక్షుడిగా షైక్ ఉబేద్ హుస్సేన్, గౌరవ అధ్యక్షుడిగా సలీం సర్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తంజీమ్ సుప్రీం బాడీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి సిద్దిపేట తంజీమ్ కమిటీ లో ఎంపిక చేసిందనదుకు ధన్యవాదాలు తెలిపారు. అతి పురాతనమైన తంజీమ్ కి ఉజ్వల భవిష్యత్తు అందించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీం బాడీ అధ్యక్షుడు జుబేర్ హుస్సేన్, కౌన్సిలర్లు వజీర్, మొయిజ్, రియాజ్, అర్షద్ మాజీ కౌన్సిలర్లు జవేద్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉళ్ళెంగల ఏకానందం, మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, పాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలను తల్లిదండ్రులకు వివరించాలి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

రోడ్డు నిబంధనలు పాటించాలని ప్రతి ఒక్క విద్యార్థి తమ తల్లిదండ్రులకు తెలియజెప్పాలని హుస్నాబాద్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనం నడిపే ప్రతి ఒకరూ సీటు బెల్టు, ద్విచక్ర దహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్ చేతన్ కుమార్ సీనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్ పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సన్నాహక ప్రతిజ్ఞ



నవ తెలంగాణ - పటాన్ చెరు

పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మహేశ్వర మెడికల్ కళాశాల, పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సన్నాహక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో అధికారులు, విద్యార్థులు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంతోష్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఓటరు తమ ఓటును సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ఓటర్లను చైతన్య పరుస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పటాన్ చెరు ఎన్నికల ఉప తహసిల్దార్ సంతోష్ కుమార్, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ,నోడల్ ఆఫీసర్ నాగరత్నమ్మ మరియు ప్రొఫెసర్స్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో అన్నదానం



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు బుక్క రమేష్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. శ్రీ రామునికి ఇష్టమైన బెల్లం పానకం పంపిణీ చేశారు. అయోధ్య రామ మందిరం లో జరిగే వేడుకలను పెద్ద ఎల్ ఈ డీ స్క్రీన్ మీద చూపించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు శేషం శ్రీనివాసచారి మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి దుర్గా ప్రసాద్, నాయకులు కొమురవెల్లి శంకరయ్య అత్తెల్లి రవి , చకిలం సంపత్,నాగేష్, గొట్టిపాముల అశోక్, జోడు ప్రకాష్,రమేష్,తిరుపతి రెడ్డి,శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటీ సభ్యులు భక్తులుపాల్గొన్నారు.

దేవాలయాల వద్ద పోలీసు బందోబస్తు



నవ తెలంగాణ - సిద్దిపేట

అయోధ్యలో శ్రీ బాల రాముడి ప్రాణ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా పట్టణంలోని దేవాలయాల వద్ద కల్యాణ మహోత్సవాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గీత భవన్, రావిచెట్టు హనుమాన్, పాత వెంకటేశ్వర్లు దేవాలయం, రామాలయం, సుభాష్ రోడ్డు, పంచముఖ హనుమాన్ దేవాలయాలలో పూజలు చేశారు. సీతారాముల కళ్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయం వద్ద భారీ తెర ఏర్పాటు చేసి అయోధ్యలో జరుగుతున్న ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని లైవ్‌లో చూపించారు. దేవాలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలు ఇంటి ముందట రంగవల్లులను వేశారు, సాయంత్రం ఐదు దీపాలను వెలిగించారు. ప్రతి ఇంటిపై కాషాయపు జెండాను ఎగరవేశారు.

చెరువు నింపితే పంట నష్టపోతాం



నవతెలంగాణ-బెజ్జంకి: సాగు కాల్వ నీరుతో పాత చెరువు నింపొద్దని.. సాగు చేస్తున్న వరి పంట నష్టపోతామని మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ ఎర్రోల్ల శ్యామ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పాత చెరువును నింపడంతో వరి పైరు మునిగిపోతుందని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని విజ్ఞప్తి చేశారు.

రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న జర్నలిస్టులు

నవతెలంగాణ-సంగారెడ్డి



సమాజ శ్రేయస్సు కోసం తమవంతు పాత్ర పోషించే జర్నలిస్టులు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగికి రక్తం అవసరమని బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుల ద్వారా జర్నలిస్టులు డేవిడ్, మురళి, రాజు, ప్రదీప్‌లకు తెలిసింది. దాంతో వారు వెంటనే స్పందించి రక్త దానం చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు, రోగి బంధువులు సదరు జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ

సంగారెడ్డి

2

మంగళవారం | 23 జనవరి 2024 | www.navatelangana.com

సర్వే నంబర్ 457లో గల భూమిని కాపాడాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



సుల్తాన్పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 457లో భూమిని కాపాడాలని సోమవారం సుల్తాన్పూర్ పాలకమండలి సభ్యులు బిక్షపతి, మన్నె సురేష్, నాయికోటి లతా మహేందర్, కుమ్మరి అనురాధ శ్రీనివాస్‌లు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమీన్పూర్ మండలంలోని సుల్తాన్పూర్ లో గల సర్వే నంబర్ 457లో 195-08 గుంటల ఇనాం భూమి ఉన్నది. అందులో రైతులు భూదాన్ యజ్ఞ బోర్డుకు సంబంధించి 190-02 గుంటలు పోగా.. 5-02 గుంటలు రాళ్లరప్పలతో పడావు ఉండగా.. ఆ భూమిలో ఏ రైతు గానీ కబ్జాలో లేరన్నారు. అయితే గత వారం రోజుల నుంచి దేవ భూషణం అనే రియాల్టర్.. ఆ భూమిని కబ్జా చేశాడని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్రమ తవ్వకాలను సహించేది లేదు

నవతెలంగాణ-న్యాల్‌కల్

అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా చేస్తే సహించేది లేదని న్యాల్‌కల్ తహసీల్దార్ భాను కిరణ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రేజింతల్ గ్రామ శివారులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీ, హిటాచి వాహనాలను రూ.10,000 జరిమానా విధించినట్టు చెప్పారు. ఇలాంటి అక్రమ తవ్వకాలు చేపడితే..కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.



ఫిబ్రవరి 16న సమ్మెను జయప్రదం చేయండి

నవతెలంగాణ-జోగిపేట

కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న చేపట్టే సమ్మెను కార్మికుల జయప్రదం చేయాలని సీటీయూ జిల్లా అధ్యక్షులు, సిబిఎల్ బీరు పరిశ్రమ గౌరవ అధ్యక్షులు బీరం మల్లేశం అన్నారు. సిబిఎల్ బీరు పరిశ్రమలో సోమవారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన అఖిలభారత సమ్మెను పురస్కరించు కొని కార్మికులందరూ ప్రతి కార్మిక కుటుంబాలను కలిసి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న చట్ట వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మార్చి 22న మన యూనియన్ 25 వసంతాల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకొని ఇతర యూనియన్ సంఘాలకు మాదిరిగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాగా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించింది



నవతెలంగాణ-కొండాపూర్

బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయామనే బాధతో మతి భ్రమించి మాట్లాడుతున్నారని.. అందుకు మాజీ మంత్రి కేటీఆర్ విద్యుత్‌పై చేసిన ప్రకటన చూస్తే అర్థమవుతున్నదన్నారు. పేదలకు 200 యూనిట్ల లోపు మాత్రమే కరెంటు బిల్లులు మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని.. కానీ కేటీఆర్ మాత్రం ఎవ్వరు కూడా కరెంటు బిల్లులు చెల్లించొద్దని అనడం విడ్డూరంగా ఉన్నదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి.. బీఆర్ఎస్ నాయకులు అసత్య పూరిత పత్రిక ప్రకటనలు చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, పది లక్షల ఉచిత ఆరోగ్యశ్రీ బీమా పథకాలను అమలు చేసిందని.. మిగిలిన పథకాలను 100 రోజుల లోపే అమలు చేసే విధంగా ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఈ విషయంపై ఎటువంటి అపోహలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అవసరం లేదన్నారు.

ఘనంగా శ్రీరాముడి పల్లకి సేవ

నవతెలంగాణ-జోగిపేట



అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా జోగిపేట పట్టణంలో శ్రీరాముని శోభాయాత్ర, అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. స్థానిక వీర హనుమాన్ దేవాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక పోచమ్మ దేవాలయం వద్ద కౌన్సిలర్లు ఎస్.సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, కే. నాగరాజు, రేఖ ప్రవీణ్, చందర్‌ల ఆ ధ్వర్యంలో ప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు పల్లకి సేవలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతి కిరణ్, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షులు జయపాల్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ మల్లికార్జున్, నాగభూషణంలు హాజరై పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసిన తర్వాత వీర, పబ్బతి దేవాలయాల వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



నారాయణఖేడ్‌రూరల్ : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి శ్రీ భవ్య రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అలాగే ఖేడ్ పట్టణంలోని పురాతన రామాలయంలో శ్రీ రామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ సెట్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, వివేకానంద, గుండెరావు పాటిల్ సర్పంచ్, సంజు పటేల్ మాజీ సర్పంచ్, జీవుల నాయక్ మాజీ ఎంపీపీ, అరవింద్, జ్ఞానేశ్వర్ పాటిల్, శ్రీకాంత్‌రెడ్డి, నరసింహారెడ్డి,కిషన్ నాయక్ పాల్గొన్నారు.



పటాన్‌చెరు : పటాన్‌చెరు పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రజలు శ్రీరాముడి పల్లకి సేవతో పాటు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయం, మహదేవుడి ఆలయం, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల్లో నిర్వహించిన వివిధ పూజా కార్యక్రమాలలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాహన ర్యాలీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సంగారెడ్డి : సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాముడి చిత్రపటానికి ఘనంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.విష్ణువర్ధన్ రెడ్డి కార్యవర్గ సభ్యులు మహేష్, ఎస్. క్రిష్ణ, డి.రాంరెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, మానిక్ రెడ్డి, బి.దయాకర్ రెడ్డి,జుల్ఫాకర్, ఎం.నాగరాజు, అరుణ కుమారి, ఎం.సతీష్, కె.రాములు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఐడీఏబొల్లారం : బొల్లారంలో ఆటో యూనియన్ లీడర్లు నాగిరెడ్డి, నందు, ముఖ్య అతిథిగా ఆనంద్ కృష్ణారెడ్డితో పెద్ద ఎత్తున ఆటో ర్యాలీ నిర్వహించారు. అలాగే బొల్లారంలో కొత్త బస్టాండ్ నుంచి హనుమాన్ టెంపుల్ వరకు ర్యాలీ నిర్వహించారు. బొల్లారంలో 2000 ఇళ్ల మీద కాషాయపు జెండాలను ఆనంద్ కృష్ణ రెడ్డి ఎగరవేశారు.



న్యాల్‌కల్ : మండలంలోని న్యాల్‌కల్, రేజింతల్, మామిడిగి, చాల్కీ, మిర్జాపూర్ (బి), హద్నూర్, చెనిగపల్లి గ్రామాల్లో శ్రీరాముడి పల్లకి సేవను ఘనంగా చేపట్టారు. గ్రామంలోని వీధుల గుండా భక్తి కీర్తనలతో ఈ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్నదాన ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలి

- దరఖాస్తులను సత్వరమే పరిష్కారించాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్లతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహి స్తున్న ప్రజావాణికి జిల్లా అధికారులందరూ విధిగా హాజరు కావాలని, హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబం ధించి ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 34 దరఖాస్తులు రాగా, అందులో 15 రెవెన్యూశాఖకు సంబంధించి నవి కాగా, ఇతర శాఖలకు సంబంధించి 19 దరఖాస్తులు అందాయన్నారు. హైదరా బాదులో ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం లో జిల్లాకు సంబంధించి వచ్చిన దరఖాస్తులకు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ నగేష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాలకు మంచి స్పందన..

ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 20,21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు మంచి స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1594 పోలింగ్ కేంద్రాల్లో రెండ్రోజుల పాటు నిర్వహించిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాల్లో ఫారం-6కు 4509, ఫారం-7కు 924 , ఫారం-8కు 1653 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.



ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

నవతెలంగాణ-రాయికోడ్

మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో హెూప్ న్యూరో ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఉచిత మందులు అందజేశారు. ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో హెూప్ న్యూరో కార్డియాలజీ ఆస్పత్రి సిబ్బంది శ్రీను గ్రామ సర్పంచ్ హన్మంతు,నాయకులు మలేశం, విశ్వనాథ, జైపాల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య రథాన్ని ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటరు చైతన్య రథాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమ వారం కలెక్టరేట్ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ప్రచార రథం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఓట ర్లకు అవగాహన కల్పిస్తూ తిరుగుతుందన్నారు. జనవరి 22న సంగారెడ్డి నియోజకవర్గం నుంచి అందోల్‌కు వెళుతుందని, సాయంత్రం అందోల్ నుండి నారాయణఖేడ్ కి వెళ్తుందన్నారు. 23న మధ్యాహ్నం నారాయణఖేడ్ నియో జకవర్గం నుండి జహీరాబాద్‌కు వెలుతుందని తెలిపారు. 24న ఉదయం జహీరాబాద్ నుంచి పటాన్చెరుకు వెళ్తుందన్నారు. జనవరి 25న సంగారెడ్డి జిల్లా కేంద్ర ంలో నిర్వహించు జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటుందన్నారు. ప్రచార రథంతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా కళాకారులు ఆయా నియో జకవర్గాలలో జాతీ య ఓటరు దినోత్సవం, ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కు వినియోగించుకోవడం తదితర అంశాలపై ప్రజలకు తమ కళాజాత కార్యక్రమాల ద్వారా అవ గాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ, జిల్లా అధికారులు ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వ అనుమతి లేకుండా.. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నడిపిస్తున్న లిటిల్‌స్టార్, సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు టి.సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. కొండాపూర్ మండలంలోని ఎంఆర్‌ఎఫ్ కాలనీలో లిటిల్ స్టార్ పాఠశాలకు ఎలాంటి గుర్తింపు లేకుండా నడిపిస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సదరు పాఠశాలకు సరైన బిల్డింగ్ లేదని.. సరైన రోడ్డు మార్గం లేదని, వసతులు కూడా లేకపోయినా పాఠశాలను నడిపిస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పని సరిగా బీఈడీ, టెట్ అర్హత కలిగిన టీచర్స్ ఉండాల్సి ఉన్నప్పటికీ.. ఇవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా స్కూల్స్‌ను నడుతున్నారన్నారు. అంతేకాకుండా మల్కాపూర్ చింతల్లో ఉన్న సంయుక్త స్కూల్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు లేనప్పటికీ.. ఉన్నదని పేరు పెట్టి నడిపిస్తున్నారన్నారు. వాస్త వానికి వారికి స్టేట్ గవర్నమెంట్ ఓపి పర్మిషన్ మాత్రమే ఉన్నదని.. ఇంటర్నేషనల్ గుర్తింపు లేదన్నారు. అయిన ప్పటికీ ప్రచారం చేసుకుంటూ ప్రజల్ని మోసం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇలాంటి పాఠశా లల వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రెండు పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆ పాఠశాలల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అర్జున్, అనిల్ కుమార్, సమీ, సిద్దేశ్వర్, శివ పాల్గొన్నారు.

దళితుడిని బెదిరిస్తున్న రియల్టర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



దళితుడు భూమిని విక్రయించాలంటూ దౌర్జన్యం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమ వారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. జహీరాబాద్ మండంలోని బూచినల్లి గ్రామానికి చెందిన పేద దళిత రైతు బెగరి దశరథ్‌కు 31/ఇ/1/2 సర్వే నంబర్‌లో ఒక ఎకరం భూమి ఉన్నది. అయితే దాని పక్కనే ఉన్న భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి.. పక్కనే ఉన్న దశరథ్ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి ఆ భూమిని తమకు విక్రయించాలని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. దిగ్వాల్ గ్రామానికి చెందిన పరమేష్, మరో ఇద్దరితో కలిసి ఈనెల 9న టీఎస్03ఈడబ్ల్యూ 6606 నెంబర్ గల కారులో వచ్చి..ఆ భూమిలో అక్రమంగా తవ్వకాలు జరిపారన్నారు. తన పొలంలో మీరెందుకు తవ్వకాలు జరుపుతున్నారని దశరథ్ ప్రశ్నిస్తే.. కులం పేరుతో దూషిస్తూ దాడికి కూడా యత్నించార న్నారు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ ఖదీర్ భాష మాత్రం పట్టించుకోకుండా.. బాధిత రైతునే బెదిరించాడని ఆరోపించారు. ఈ విషయాన్ని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై దృష్టికి తీసుకుపోయినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ భూమిని ఎలాగైనా తమకు విక్రయించాలని రియల్టర్లు పదే పదే ఫోన్ చేసి బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు బాలరాజు,కర్ణం రవి, బాధిత రైతు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

పాటి గ్రామంలో బోగస్ ఓట్లను తొలగించండి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పాటి గ్రామంలో నమోదు చేసిన బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్, రజనీకాంత్‌లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు సామరాజు, వార్డు సభ్యులతో కలిసి ఉప తహసీల్దార్ కార్తిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల అనంతరం ప్రభుత్వం నూతన ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టగా.. ఎలాంటి స్థానిక సరైన నివాస ఆధారాలు లేకుండానే స్థానికేతర బోగస్ ఓట్లను నమోదు చేసినట్లు ఆరోపించారు. గ్రామంలోని 288 పోలింగ్ స్టేషన్‌లో నెంబర్ 115, 1155, 1157, 1158, 1159, 1160లలో బోగస్ ఓట్లు ఉన్నాయన్నారు. గ్రామంలో 13-26/1,1389/1,9-42/2 అనే ఇంటి నెంబర్‌తో కొందరికి ఓటు హక్కు వచ్చిందని.. అసలు గ్రామంలో అలాంటి ఇంటి నెంబర్లే లేవన్నారు. ఇవేకాక నూతనంగా నిర్మిస్తున్న విల్లాస్‌లను కూడా వదల కుండా బోగస్ ఓట్లను సృష్టించారన్నారు. గ్రామంలో సుమారు నాల్గు వందల వరకు బోగస్ ఓట్లను నమోదు చేశారని ఆరోపించారు. ఇలా ఊరు పేరు లేని ఓట్లు ఎందుకు నమోదు చేశారని బీఎల్‌ఓ విద్యావతిని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానం చెప్పారన్నారు. ఇప్పటికైనా గ్రామంలో బోగస్ ఓట్లను తొలగించి.. బోగస్ ఓట్లు నమోదు చేసిన, చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మధుసూదన్ రెడ్డి, కుమార్,శ్రీనివాస్ యాదవ్, చంద్రశేఖర్ గౌడ్, ఎస్ఎస్ రాజ్, మనోజ్ యాదవ్, రవీందర్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు భేల్ భవన్స్ విద్యార్థులు

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భేల్ భవన్స్ కు చెందిన విద్యార్థులు నవనీత్, యశ్విర్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఉమా శాస్త్రి మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జనవరి 4న భేల్‌లో జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించారని అన్నారు. జనవరి 23 నుంచి 25 వరకు హైదరాబాద్‌లోని దోమలగూడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని సంతోషం వ్యక్తం చేశారు. ఇదివరకే తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రీతి రెడ్డి, అమృత జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు. విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, హెడ్ మిసెస్ భాను నిర్మల ఈ సందర్భంగా అభినందించారు.

నూతన అభివృద్ధి పనులకు ప్రణాళికలు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రూ.కోటి విలువ గల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం

నవతెలంగాణ-గుమ్మడిదల



మండల పరిధిలోని ప్రతి గ్రామంలో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు, నూతన పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలో సోమవారం కోటి రూపాయల విలువగల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. వీరారెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన పంచాయతీ భవనం, రామిరెడ్డి బావి గ్రామంలో జీవీఆర్ ఎంటర్ప్రైజెస్ సౌజన్యంతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లను, కానుకుంట గ్రామంలో సీసీరోడ్లు, యూజీడి నిర్మాణం పనులకు మండల ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. గుమ్మడిదల పరిధిలోని శ్రీ కళ్యాణ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా గత పదేండ్లలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దామన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు సీనియర్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్, కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హస్నాబాద్‌లో ముగిసిన ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-రాయికోడ్



మండలంలోని హస్నాబాద్ గ్రామంలో గత ఐదు రోజుల నుంచి ఘనంగా జరుగుతున్న హజరత్ శంషేర్ తబ్రెస్ ఉర్సు ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ ఉర్సు ఉత్సవాలకు ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో పాటు మండల ప్రజాప్రతినిధులు పాల్గొని.. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరి రోజైన సోమవారం స్థానిక సర్పంచ్ పుర్ర హన్మంతు, ఎంపీపీ మమత అశోక్, ఉప సర్పంచ్ జైపాల్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. కొబ్బరికాయల కుస్తీ మొదలుకొని వెండి కడియాల కుస్తీ వరకు ఆశక్తికరంగా సాగాయి. జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలైన మల్లయోధులకు వెండి కడియాలు, నగదు బహుమతులను ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బస్వరాజు పాటిల్, ఆత్మ చైర్మెన్ విటల్, ఆయా గ్రామాల సర్పంచులు నాగార్జున, కృష్ణ, విట్టల్ రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, మైపాల్ రెడ్డి, నర్సమ్మ అడివయ్య, తుల్జామ్మ మొగులయ్య, స్థానిక హస్నాబాద్ గ్రామ ప్రజాప్రతినిధులు లింగమయ్య, విశ్వనాథ్ పాటిల్,మల్లేష్ కురుమ, సలీం,చిరంజీవితదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు అర్హత



నవతెలంగాణ-మెదక్ టౌన్

హైదబాద్‌లో ఆదివారం జరిగిన పురుషుల ఇంటర్ కాలేజి టోర్నమెంట్‌లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు చెందిన కేతవత్ సంజు, బానోత్ ముఖేష్ లు 10 కే రన్‌లో విజయం సాధించారు. అంతే కాకుండా యస్ ఆర్ టి యు యూనివర్సిటీ నాందేడ్‌లో జరగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ రేస్‌లో పాల్గొనటానికి అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అకడమిక్ కో ఆర్డినేటర్ డా ఏ సుధాకర్, పి సురేంద్ర రావు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌ల ోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి ప్రజల నుంచి 31 ఫిర్యాదులజను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా భూములకు సంబంధించినవి కాగా, ఉద్యోగం, పెన్షన్ తదితర ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్ఓ పద్మశ్రీ, డిపిఓ సాయిబాబా, డిఆర్డిఓ శ్రీనివాస్, డిఎఫ్ఓ రవి ప్రసాద్, డిఏఓ గోవింద్, డిఈఓ రాధాకిషన్, డిడబ్ల్యూఓ బ్రహ్మాజీ, డిఐఈఓ సత్యనారాయణ, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలి

- విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలి
- ఎస్‌పి బాలస్వామి ఐ.పి.ఎస్

నవతెలంగాణ మెదక్

విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్‌పి బాలస్వామి ఐ.పి.ఎస్ తెలిపారు. సోమవారం మెదక్ జిల్లా ఎస్.పి. బాలస్వామి ఐ.పి.ఎస్ ఆదేశానుసారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో మెదక్ జిల్లా సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) శిక్షణలో భాగంగా జిల్లా అదనపు ఎస్.పి . మహేందర్ ఆధ్వర్యంలో ఏఆర్ డి.ఎస్.పి శ్రీ.రంగ నాయక్, అడ్మిన్ ఆర్.ఐ శ్రీ.అచ్యుతరావ్ శిక్షణలో సాయుధ దళ సిబ్బంది, అధికారులకు సాయుధ దళాల వార్షిక పునరుచ్చరణ (మోబిలైజేషన్) శిక్షణ కార్యక్రమం ప్రారంచించారు. ఇందులో భాగంగా సిబ్బందికి ప్రతి రోజు ఉదయం ఫిజికల్ ట్రైనింగ్, పెరేడ్, మాబ్ ఆపరేషన్, ఆయుధాల శిక్షణ, నాకబంది, విఐపి, వివిఐపి, సెక్యూరిటీ, ఇతర అంశాలపై శిక్షణ క్లాసులు ఆర్.ఐలు అడ్మిన్ ఆర్.ఐ అచ్యుతరావ్, యం.టి. ఆర్.ఐ నాగేశ్వర్ రావ్, ఆర్‌ఎస్‌ఐలు నరేష్, భవానీ కుమార్, .మహిపాల్, సుభాష్, యశ్వంత రావ్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి బాలస్వామి ఐ.పి.ఎస్ మాట్లాడుతూ ఏఆర్ అధికారుల సిబ్బంది పనితీరు శ్లాఘనీయమన్నారు. ఏఆర్ సిబ్బంది ఒక్క ఏఆర్ డ్యూటీనే కాకుండా సివిల్ పోలీసులతో యుక్తంగా లా అండ్ ఆర్డర్ విధులు నిర్వహిస్తారన్నారు. ఏఆర్ సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు, వారిని కొత్త సవాళ్లను స్వీకరించేందుకు సమాయత్తం చేసేందుకు ఆన్యువల్ మొబిలైజేషన్‌లో భాగంగా ఈ ప్రాక్టీస్ విధి నిర్వహణలో భాగంగా దోహదపడుతుందన్నారు. ఆన్యువల్ మొబిలైజేషన్‌లో భాగంగా ఏఆర్ సిబ్బందికి





వారు రోజువారి నిర్వహించే విధుల పట్ల, తదితర అంశాలపై ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో ఉండి శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని తద్వారా ప్రవర్తనలో మార్పు చెందాలని శిక్షణ ద్వారా మన జీవన విధానం మెరుగుపరచుకోవచ్చు అని తెలిపారు. శిక్షణ ద్వారా సిబ్బందికి వ్యూహాత్మక నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యూహాత్మకంగా ఆలోచించడం నేర్పింపబడుతుందన్నారు. దీంతో పోలీసులు ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వర్తించే వీలు కలుగుతుందన్నారు. సమీపం నుంచి ప్రత్యర్థిని ఎదుర్కోవడం, ముష్కరులను నిరాయుధులను చేయడం, వ్యూహంగా మారి తలపడడం, స్కిల్ డెవలప్మెంట్ తదితర అంశాల గురించి సిబ్బంది ఈ శిక్షణ ద్వారా నేర్చుకోవాలన్నారు. అలాగే పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ, శారీరక దారుఢ్యం సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, సమయం దొరికినప్పుడు ఆరోగ్యంపై దృష్టి పెట్టి ప్రతిరోజు వ్యాయామం చేసుకోవాలని పోలీసులు ఆరోగ్య పరంగా దృఢంగా ఉన్నప్పుడే బాగా పని చేయగలుగుతారని ఎస్పీ తెలిపారు. అనంతరం పోలీస్ ధర్బార్ నిర్వహించి పోలీస్ సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది తమ సమస్యలను ఎస్.పి దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది సమస్యలు విన్న ఎస్పీ వెంటనే సంబందిత సిబ్బందికి తెలిపి సమస్య పరిష్కరించేల చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశానేజ పోలీస్ సిబ్బంది మంచిగా విధి నిర్వహణ చేస్తే అవార్డ్స్, రివార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని, పోలీసులు క్రమశిక్షణ తప్పుతే దాని వల్ల పోలీస్ శాఖకు చెడ్డ పేరు వస్తే వారి పైన శాఖపారమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- చేగుంట

మండల కేంద్రంలోని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అయిత చంద్రమౌళి ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయంం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రమౌళిని సోమవారం ఆయన నివాసంలో పరామర్శించారు. తన కుమారులు పరంజ్యోతి, రఘు రాములును ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పిటిసి శ్రీనివాస్, ఎస్సీఎస్టీ భిక్కి వెంకటయ్య, ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

29 నుంచి జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

జెడ్పీ సీఈవో శైలేష్

నవతెలంగాణ-మెదక్

ఈ నెల 29 నుంచి జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు ప్రారంభం కానున్నయని జెడ్పీ సీఈఓ శైలేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు స్థాయి సంఘం 3 వ్యవసాయం, మధ్యాహ్నం 2 గంటలకు స్థాయి సంఘం-5 స్త్రీ శిశు సంక్షేమం, మధ్యాహ్నం-3 గంటలకు స్థాయి సంఘం-6 సాంఘిక సంక్షేమంపై సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఈనెల 30వ తేదీన ఉదయం 10:30 గంటలకు స్థాయి సంఘం-2 గ్రామీణాభివృద్ధి, మధ్యాహ్నం 12 గంటలకు స్థాయి సంఘం-4 విద్య, ఆరోగ్యం, మధ్యాహ్నం 2:30 గంటలకు స్థాయి సంఘం-1 ఆర్థిక ప్రణాళిక, మధ్యాహ్నం 3:30 గంటలకు స్థాయి సంఘం-7 పనులపై జరుగుతాయని, సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో పాల్గొనాలని తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఆర్ అండ్ బి మంత్రికి వినతి పత్రం అందజేసిన దుబ్బాక ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేగుంట, మిరుదొడ్డి

మండలంలోని రహ దారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆర్ అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డినీ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. చేగుంట నుంచి బోనాల రోడ్డు నిర్మాణానికి రూ,70, లక్షలు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి



నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి బాలస్వామి ఐ.పి.ఎస్. ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదిదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరిం చాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట్ మండలం వీరోజిపల్లి గ్రామానికి చెందిన సిర్గపురం రాములు తన సొంత పట్టా భూమిని సిర్గపురం సంగమేశ్, సిర్గపురం దేవయ్య అనే వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఎందుకు ఇలా చేస్తున్నారు అని అడగగా ఆయుధాలతో బెదిరిస్తున్నారని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని పెద్ద శంకరంపేట్ ఎస్.ఐకి తగు సూచనలు చేశారు. అలాగే చేగుంట మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శివలింగం భూదయ్య వారు మొత్తం ముగ్గురు అన్నదమ్ములని వారికి ఉన్న భూమిని వారి తండ్రి ఎవరి వాటా వారికి ఇచ్చినా, భూదయ్య ఇద్దరు తమ్ముడ్లు, తమ్ముడ్ల కొడుకులు, తమ్ముడ్ల భార్యలు, తమ్ముని కూతురు దౌర్జన్యంగా తన భూమిలో దున్నుతుండగా చూసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆ విషయం తెలిసి తనని, తన భార్యను చితకబాదారని వారిపై తగిన చర్యలు తీసుకోని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని చేగుంట ఎస్.ఐకి తెలిపారు.

నెరవేరిన వందల సంవత్సరాల కల

నవతెలంగాణ- చేగుంట

అయోధ్య విషయంలో కొన్ని వందల సంవత్సరాల కల ఇప్పుడు నెరవేరిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీతారామ కాలనీ, హనుమాన్ కాలనీలో సోమవారం అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి సీతారామ కాలనీకి ఊరేగింపు నిర్వహించి, సీతారామ కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, దుబ్బాక అభివృద్ధికి పాటుపడతానని, రాముని ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు. చేగుంట ప్రజలు తమకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. అదే విధంగా చిన్న చిన్న పనులు చేయాల్సి ఉందని, త్వరలోనే ఆ పనులన్నీ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అయోధ్య రాముని ఆశీస్సులతో పాడి పంటలు, ప్రజలందరూ క్షేమంగా ఉండాలున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ మాసుల శ్రీనివాస్ జెడ్పిటిసి శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ చైర్మన్ భిక్కి వెంకటయ్య, ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మి, సర్పంచి మంచి కట్ల శ్రీనివాస్, కొఠారి అశోక్, విశ్వహిందూ పరిషత్ నాయకులు సురేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

అయోధ్యలో శ్రీ బాల రాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ మేరకు చల్మెడ గ్రామంలో అక్కపల్లి రామిరెడ్డి సహకారంతో తీసుకుని వచ్చిన నూతన శ్రీ సీతారాముల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అలాగే నిజాంపేట మండల కేంద్రం లోని మంజీరా స్కూల్ ఆవరణలో పెద్ద స్క్రీన్‌ను ఏర్పాటు చేసి అయోధ్య నుంచి మోడీ ప్రారంభించిన రామ మందిర కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో చల్మెడ గ్రామ సర్పంచ్ నరసింహ రెడ్డి, తిరుమల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, అబ్బా రెడ్డి, ముత్యం రెడ్డి, పందిరి భూమయ్య, బొమ్మెన మల్లేశం, నిజాంపేట మంజీరా స్కూల్ యాజమాన్యం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ అనూష లక్ష్మీ నరసింహులు, ఆముద రాజు, మావురం రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

అయోధ్యలో శ్రీ బాల రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ప్రధానమంత్రి మోడీ చేతులమీదుగా ప్రారంభోత్సవం పురస్కరించుకొని పెద్ద శంకరంపేటలో రామాలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రామాలయం ఆవరణ మొత్తం కాషాయ మయంగా అందంగా అలంకరించారు. సోమవారం రామాలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ అధ్యక్షుడు గుజరి కనకరాజు ఎంపీపీ జంగం శ్రీనివాస్ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్ ఎంపీటీసీ వీణ సుభాష్ గౌడ్ బాధ్యులు కందుకూరి రవీందర్ అన్నారం సత్యనారాయణ, దాదిగారి గంగాధర్, రాగం శ్రీనివాస్, సీతారామారావు, సతీష్ గౌడ్, రవి వర్మ సర్వేశ్వర్, కృష్ణమూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట

మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకొని సోమవారం శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆలయ ధర్మకర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోల్కొండ కిషన్ రావు దేశ్ముఖ్ ఆధ్వర్యంలో రాములవారి సంకీర్తనలు ఆలపిస్తూ వెంకటేశ్వర దేవాలయం పైన కాషాయం జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ వంశపార్యంపర ధర్మకర్త, గోల్కొండ కిషన్ రావు దేశముఖ్, లింగంపల్లి జైపాల్ రావు, గ్రామ సర్పంచ్ దోరగొల్ల రాములు, కుమ్మరి భూపాల్, రాములు, సత్యనారాయణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని దేశ ప్రదాని ఇచ్చిన పిలుపుతో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోని ప్రతి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా దేవాలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు భక్తి పాటలతో రామనామ స్మరణ మారుమ్రోగింది. అన్నదాన కార్యక్రమాలలో గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో స్వయంభూ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గల రామాలయంలో ఉదయం నుంచే పండగ వాతావరణం నెలకొంది. మనోహరాబాద్ మండలంలోని ప్రతి గ్రామంలో హనుమాన్, రామాలయా లలో భక్తి శ్రద్ధల మధ్య భక్తి కార్యక్రమాలను చేపట్టారు. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో సర్పంచ్ నరాల ప్రభావతి, మాజీ సర్పంచ్ బసన్నగారి సంజీవ, ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు సత్యనారాయణ, బీజేపి నాయకులు నర్సింలులతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కూచారం గ్రామంలో సర్పంచ్ జక్కిడి నరెందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమాలు, ఆర్కెస్ట్రాలు భక్తి పాటలతో ప్రజలను అలరించాయి. అనంతరం కోనాయిపల్లిలో బీజేపి నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామంలో శోభా యాత్రను నిర్వహించారు.

నవతెలంగాణ-పాపన్నపేట

అయోధ్యలో బాల రాముడు ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు, పల్లకి సేవలు పండుగ వాతావరణంలో నిర్వహించారు . ఇందులో భాగంగా మండల కేంద్రమైన పాపన్నపేటలో రామాలయం నుంచి శ్రీరామచంద్రుడి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో పురవీధుల గుండా బాజా బాజంత్రిల మధ్య ఊరేగింపు నిర్వహించారు. మల్లంపేట రామాలయం వద్ద భక్తులు పెద్ద ఎత్తున చేరి భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-చిన్న శంకరంపేట.

చిన్న శంకరంపేట మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాలలో సీతారాముల ఆలయాలలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అయోధ్య రామ మందిరం నిర్మాణం, సీతారాముల ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం ఎస్ కొండాపూర్ గ్రామంలో ప్రజలు మహిళలు డప్పు చప్పులతో మంగళహారతులతో ర్యాలీగా గ్రామ శివారులో గల ఏడు ఇప్పల వద్ద వెలసిన సీతారాముల గుడి వరకు ర్యాలీగా బయలుదేరారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు యువకులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.







నవతెలంగాణ-వెల్దుర్తి

అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండల వ్యాప్తంగా హనుమాన్ దేవాలయాల్లో రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు దేవత మూర్తులను పల్లకి సేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. రాముని సంకీర్తనలు ఆలపించారు. ఊరువాడ అంత రామమయం అయింది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నార్సింగి

అయోధ్యలో శ్రీ బాల రాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ సేవా సమితి శేరిపల్లి ఆధ్వర్యంలో శ్రీరాముని ఉత్సవ విగ్రహా లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెప్యాలా మల్లేశం ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రశాంత్, ఉపాధ్యక్షులు కుంటోల్ల రాజశేఖర్, గజవెల్లి నవీన్, సంయుక్త కార్యదర్శి అరుణ్ యాదవ్, కోశాధికారి తాళ్ల పాపా గౌడ్, గ్రామస్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు సాకలి శ్రీనివాస్ బండారు రమేష్ యాదవ్ ఇండ్ల శ్రీనివాస్ శ్రీరామ్ యాదగిరి కాజిపల్లి నేరోళ్ల రాజు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్య



నవతెలంగాణ-హత్నూర

దళిత మహిళా సర్పంచ్ పై కొందరు పెత్తందారులు దాడికి యత్నించడం హేయమైన చర్య అని బీఎస్పీ మెదక్ జిల్లా అధ్యక్షులు కుతాడి నర్సింలు మండిపడ్డారు. సోమవారం మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి వెళ్లి సర్పంచ్ స్వరూపను పరామర్శించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కూతాడి నర్సింలు మాట్లాడుతూ వడ్డేపల్లి గ్రామా సమీపంలో సురభి కంపెనీ అనుమతులు ఇచ్చారని అక్కసుతో సర్పంచ్ స్వరూపపై కొందరు పెత్తందారులు దాడికియత్నించడం తము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పరిశ్రమలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇస్తాయని ఏదైనా సమస్య ఉంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడి పరిశ్రమను రద్దు చేయించాలన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం మెరకే సర్పంచ్ అనుమతులు ఇచ్చారన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బియస్పీ అధ్యక్షుడు తాళ్ల జనార్దన్ గౌడ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల మల్లేశం, మెదక్ జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ సారా రవి గౌడ్,మండల అధ్యక్షుడు పవన్ కుమార్, నాయకులు ఎర్ర వేకటేశం నాయకులు పాల్గొన్నారు.

సైన్స్‌ల్యాబ్ గ్రంథాలయ భవన ప్రారంభోత్సవం

నవతెలంగాణ-వెల్దుర్తి



మాసాయిపేట ఉన్నత పాఠశాలలో శాంత ఫౌండేషన్ లైన్స్ క్లబ్ ఆఫ్ ఇన్ ఫీల్డ్ ఆలీడ్ చారిటీస్ ఈ టీ ఈ లండన్ సుగుణ రామ్మోహన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు లండన్‌లో స్థిరపడిన మాసాయిపేట గ్రామానికి చెందిన డాక్టర్ మాధవి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి దివంగత అంతి రెడ్డి గారి కేశవరెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన సైన్స్ ల్యాబ్ గ్రంథాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాధా కిషన్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి లక్షల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ గ్రంథాలయ భవనం నిర్మించడమే కాకుండా సైన్స్ పరికరాలు పుస్తకాలు ఫర్నిచర్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. గ్రంథాలయమును సైన్స్ ల్యాబ్ ను సద్వినియోగం చేసుకున్నప్పుడే దాతల వితరణకు అర్థం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మాట్లాడుతూ మాసాయిపేట ఉన్నత పాఠశాలలో అన్ని వసతులతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్ ను గ్రంథాలయమును మాసాయిపేట విద్యార్థులే కాకుండా జిల్లా విద్యార్థులు కూడా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం శాంత ఫౌండేషన్ లండన్ ప్రతినిధి విజయ భాయి పటేల్ మాట్లాడుతూ పాఠశాలలో కష్టపడి ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంతి రెడ్డి విట్టల్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, అంతి రెడ్డి గారి కేశవరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు ప్రముఖ వైద్యులు డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ ప్రణీత రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రూపాలి, ప్రకాష్ శాంత ఫౌండేషన్ ప్రతినిధులు బిక్కు భాయ్ పటేల్ స్మిత భాయ్ పటేల్, శశి జాన్ పటేల్, తాసిల్దార్ జ్ఞాన జ్యోతి, సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాం గౌడ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముంతాజ్ అలీ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముందుకు సాగని రోడ్డు పనులు

- ఇండ్లు కూల్చివేసినప్పటికీ ముందుకు సాగని రోడ్డు పనులు

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో రోడ్డు వెడల్పులో భాగంగా ఇండ్లను కూల్చివేయడం జరిగింది. దాదాపు రెండు నెలలు అవుతున్నప్పటికీ నేటికీ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో రోడ్డు పనుల కోసం గత ప్రభుత్వము దాదాపు రెండు కోట్లకు పైన మంజూరు చేశారు. రోడ్డు కోసం గ్రామస్తులు తమ ఇండ్లను కూడా కోల్పోయినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన పనులు జరగడం లేదని వాపోతున్నారు. రాత్రిపూట నడవాలంటే నడవలేని స్థితి వాహనదారులు ఎంతోమంది కింద పడిపోయి పలువురు గాయాల పాలైనారు. మంచినీటి పైపులు పగిలి పోవడంతో పైపులలోకి మురికి నీరు చేరి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన నాయకులు కూడా ఎవరు స్పందించడం లేదన్నారు. నాయకుల నిర్లక్ష్యం వలన కూడా పనులు ఆలస్యంగా చేస్తున్నారని నాయకులు కూడా పట్టించుకోవాలని కోరుతు న్నామన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు వెంటనే స్పందించి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

దాదాపు రెండు నెలల క్రితం మా ఇల్లును కూల్చివేశారు. ఇంటిని పునర్నిర్మించుకోవాలంటే రోడ్డు పనులు పూర్తి అయితే ఇల్లును పూర్తిగా నిర్మించుకోవచ్చన్నారు. రాత్రిపూట ఈ రోడ్ వెంబడి నడవాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నామని అధికారులు కూడా పట్టించు





కోవడంలేదని, వృద్ధులు, దివ్యాంగ వాహనదారులకు నడవలేని పరిస్థితి ఏర్పడింది. నల్ల నీటి పైపులు పగిలిపోవడంతో మురికి నీరు చేరి ఇబ్బందులు ఏర్పడడంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందంటున్నాము. అధికారులు కాంట్రాక్టర్లు వెంటనే స్పందించి త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నాము.

- కళావతి, నస్కల్, గ్రామవాసి

పంచాయతీ కార్యాలయ నూతన భవనం ప్రారంభం

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో వివిధ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సోమవారం సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు పెడతల ఎల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమర్ సుల్తానా, ఉప సర్పంచ్ మీస రవి తేజ,వివిధ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శి పాకాల నవ్యవార్డు సభ్యులు,మాజీ ఉప సర్పంచ్,మాజీ ఎంపీటీసీ లు, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు,ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్ లు, సి ఏ లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండల కేంద్రంలో గల అక్షర పాఠశాలలో సోమవారం అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా జై శ్రీరాం అనే ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి భక్తిని చాటుకున్నారు. విద్యతో పాటు ఆధ్యాత్మికతపై కూడా దృష్టిని సాధించాలన్నారు. విద్యార్థులకు ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. ఏకాగ్రతతో చదివితేనే మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. అయోధ్య రామమందిరం చరిత్రను విద్యార్థులకు వివరించడం జరిగింది. కార్యక్రమంలో కరెస్పాండెంట్ రామస్వామి ప్రిన్సిపాల్ సంతోషి జ్యోతి వైస్ ప్రిన్సిపాల్ సుదర్శన్ ఉపాధ్యాయులు రేణుక ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు వాతావరణం దెబ్బ

- ఎదగని వరినారు
- వరి నాట్లకు ఆలస్యం
- ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులే కారణమంటున్న రైతులు



నవతెలంగాణ-గజ్వేల్

ఉదయం చలి మధ్యాహ్నం వచ్చే సరికి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. చలి, వేడి ఉష్ణోగ్రతల వల్ల వరి నారుకు దెబ్బ పడుతుంది. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల తదితర ప్రాంతాల రైతులు వరినట్లు చివరి దశకు వస్తుంది. పెరుగుతున్న పగటి ఉష్ణోగ్ర తలు వరి సాగుపై ప్రభావం చూపేలా కనిపిస్తున్న యని రైతులు వాపోతున్నారు. సాధారణంగా ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారం నుంచి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపిస్తుంది కానీ ప్రస్తుతం పగటిపూట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు మించి నమోద వుతున్నాయి. దీనికితోడు వరి నాట్లు ఆలస్యమవుతున్నాయి. దీనివల్ల వరి వంట పాలు తాగే సమయంతో పాటు, చేతికొచ్చేనాటికి కరెంటు కోతలు, వడగళ్ల వంటి సమస్యలను తప్పించుకునేదెలా? అనే సందే హాలు వ్యక్తమవుతున్నాయి. బోర్లలో నీటి లభ్యత, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలతో చాలామంది రైతులు వరి సాగుకు శ్రీకారం చుట్టారు. పదేళ్ల కిందకు జిల్లాలో రబీలో వరి సాగు గరిష్టంగా 80వేల ఎకరాల్లో సాగయ్యేది. ఈ సీజన్లో జిల్లాలో సుమారుగా 3.77 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవనున్నాయి. అందులో ప్రధానంగా 3.48 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశాలున్నాయి. రబీ సీజన్లో జనవరి 15 వరకు వరి నాట్లు చివరి దశకు చేరుకుంటాయి. ఏప్రిల్, మే నెలలో పంట చేతికొస్తుంది. ఈ సమయా నికి పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. విద్యుత్తు డిమాండు కూడా అధికంగా ఉంటుంది. అందుకే రైతులు జనవరి రెండో వారం వరకు నాట్లు పూర్తయ్యేలా చూసుకుంటారు. ఈసారి ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవటంతో చలికి వరి నారు సరిగా ఎదగలేదు. ఫలితంగా నాట్లు మూడు, నాలుగు వారాలు ఆలస్యమ వుతున్నాయి.

విద్యుత్ శాఖ అప్రమత్తత అవసరం

జిల్లాలో 1.60 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. సుమారు 1.80 లక్షల బోర్లు వినియోగిస్తున్నట్లు అంచనా. వీటికి 28వేల నియంత్రికలతో కరెంటు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 18 గంటల త్రీఫేజ్, 6 గంటల సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతు న్నారు. జిల్లాలో రోజుకు 9 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తుండగా, అందులో 5 మి. యూనిట్లు వ్యవసాయానికే వాడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో సాగుకు 8 మి.యూనిట్ల విద్యుత్తు అవ సరం ఉంటుందని అధికారుల అంచనా. ఇప్పటినుంచే అప్రమత్తంగా వ్యవహరిస్తే కాని వరి పంట గట్టెడే. పరిస్థితి ఉండదన్న అభిప్రాయాలు అధికారుల్లో వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు భద్రత నిత్య జీవితంలో భాగం కావాలి

- సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు



నవతెలంగాణ-సిద్దిపేట

రోడ్డు భద్రత అనేది నిత్య జీవితంలో ఒక భాగం కావాలని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సిద్దిపేట పట్టణానికి చెందిన సుమారు 150 మంది యువతీ, యువకులకు టెస్ట్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది ప్రతి క్షణం, ప్రతి నిమిషం, ప్రతి రోజూ అవసరమని, దానిని నిర్లక్ష్యం చేయద్దన్నారు. ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చైతన్యపర్చేందుకే రవాణా శాఖ రహదారి భద్రత వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరు తప్పకుండా సీట్ బెల్టు, హెల్మెట్ లు ధరించాలని అన్నారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రాణ నష్టం జరుగుతుందని అన్నారు. హరీశ్‌రావు నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ లు అందజేస్తున్నారని, అందరూ ఇంతమంచి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ కవిత, రవాణా శాఖ అధికారులు, నాయకులు హర్షద్, రాజు, రజినీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-జగదేవపూర్



టీఎస్ యూటీఫ్ జగదేవపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలో టీఎస్ యూటీఫ్ మండల శాఖ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా టీఎస్ యూటీఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునిగడప పాఠశాలలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో తరగతి ఒక ఉపాధ్యాయుని నియమించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని అన్నారు. తద్వారా ఉన్నత పాఠశాలలో సైతం విద్యార్థుల నమోదు శాతం పెరుగుతున్నది అన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. టీఎస్ యూటీఫ్ జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామి ప్రకారం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రమోషన్లు కల్పించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివుడు,ప్రధాన కార్యదర్శి రాజనర్సింహలు, జిల్లా నాయకులు చేర్యాల రాంచంద్రం, ప్రవీణ్ కుమార్, గాంతి రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి పోటీలు

నవతెలంగాణ-గజ్వేల్



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రజ్ఞాపూర్‌లో గజ్వేల్ మండల నోడల్ అధికారి, ప్రధానోపాధ్యాయులు వై.కృష్ణ చేతుల మీదుగా సోమవారం పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్ట్ వలన విద్యార్థు లు తమ సైన్స్ ప్రతిభను మెరుగుపరచుకోవడం కోసం, అలాగే సైన్స్ పై జిజ్ఞాస ని పెంచుకోవడం కోసం ఉపయోగపడుతుందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పి. నర్సింలు మాట్లాడుతూ ప్రభుత్వ ,ప్రైవేటు రంగం లో 8 ,9, 10వ తరగతుల విద్యార్థులు ఈరోజు పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ను గజ్వేల్ మండలం లో 15 పాఠశాల లు, రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించని పాఠశాలలు జనవరి 26 లోపు నిర్ణయించుకోవచ్చని అన్నారు. నిర్వహించిన పాఠశాలలో తరగతికి ఒకరు చొప్పున మండల స్థాయి టెస్ట్ కి హాజరు కావాల్సి ఉంటుంది. కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు అనురాధ, మంజుల పాల్గొన్నారు.

దేవులపల్లి రమేశ్‌కు జాతీయ సాహిత్య పురస్కారం

నవతెలంగాణ-నంగునూరు



త్యాగరాయగానసభలో 127వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో నంగునూరు మండల కేంద్రానికి చెందిన దేవులపల్లి రమేశ్‌కు జాతీయ సాహిత్య పురస్కారం పొందారు. కవి దేవులపల్లి రమేశ్ సాహిత్య సేవలు అందిస్తున్నందుకు కళావేదిక, అంతర్జాతీయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సౌరభాలు, కవి సమ్మేళనంలో చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు లలిత చేతుల మీదుగా 127వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవులపల్లి రమేశ్ మాట్లాడుతూ తెలుగు గొప్పతనాన్ని నేటి విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్క తెలుగు వారు తెలుగు కోసం కృషి చేయాలని కోరారు.సాహిత్య సేవను గుర్తించి సాహిత్య పురస్కారం ఇచ్చినందుకుగాను కళావేదిక వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెరసాని మొగులయ్య జబర్దస్త్ కళాకారుడు మురళీధర్, వివిధ రాష్ట్రాల కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-మిరు దొడ్డి



మిరుదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవంతో పాటు బాలరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించినట్లు తీర్థ క్షేత్ర ట్రస్ట్ కన్వీనర్ కానుగంటి శ్రీనివాస్ తెలిపారు. వందల సంవత్సరాలుగా హిందువులు ఎదురుచూస్తున్న కలను నిజం చేసిన ఘనత ప్రధాని మోడీ దేనని కొనియాడారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని ఆద్యంతం తిలకించారు. అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కళ్యాణ అనంతరం స్వామివారికి ఓడి బియ్యం మహిళలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో వరదాచార్యులు రాజ పున్నయ్య శర్మగోపాల చారి రాజు పంతులు చంద్రశేఖర్ శర్మ రమేష్ శర్మతో పాటు దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్సవమూర్తులకు ఎదుర్కోలు

నవతెలంగాణ-కొండపాక



అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద స్క్రీన్లు పెట్టి అయోధ్య కార్యక్రమాలను వీక్షించారు. జై శ్రీ రామ్ అంటూ గ్రామాల్లో దద్దరిల్లింది. కొండపాక మండలం కేంద్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రామాలయ ప్రాంగణంలో ఎల్ ఈ డి స్క్రీన్ లను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగిన కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం రామాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సోమవారం శ్రీ సీతారామ కళ్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గ్రామంలోని రావిచెట్టు హనుమాన్ దేవాలయం నుంచి ఉత్సవమూర్తులకు ఎదురుకోలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం జరిగింది. కార్యక్రమంలో కొసిర బోయిన కృష్ణమూర్తి బుద్ధి రాములు రామకృష్ణారెడ్డి ఆరుట్ల కనకయ్య హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడి, ఎంపిటిసి ఆంజనేయులు, రాంపల్లి గ్రామ సర్పంచ్ లతా సురేందర్ రెడ్డి, వి.హెచ్.పి.ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు నరసిహా రెడ్డి, తిరుపతి రెడ్డి, సురేశ్, రాజు, రవీందర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు. కుకునూర్ పల్లిలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకము చేశారు. గ్రామంలో శ్రీరామచంద్రస్వామి రథ శోభాయాత్ర కోలాటాలతో భజనలతో స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. శివాజీ యూత్ వారి ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సోషల్ మీడియా గ్రూపు నిర్వాహకుడు సంపత్‌కు సన్మానం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



ప్రముఖ కవి, కళాకారుడు, సోషల్ మీడియా గ్రూపు నిర్వాహకుడు ముక్కెర సంపత్ కుమార్‌ను ఆదివారం రాత్రి నాచారం ప్రతిభ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. సోషల్ మీడియాలో సుమారు 1200 మందితో సాహిత్య గ్రూపును నిర్వహిస్తూ అనేక ప్రక్రియల ద్వారా నూతన రచయితలకు ప్రోత్సాహం అందిస్తున్నందుకు సంపత్ కుమార్ ను ప్రజాకవి జయరాజు, సినిగే రచయిత మౌనశ్రీ మల్లిక్, పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ గాజుల శ్యాంప్రసాద్ లాల్, ఎడిటర్ బైస దేవదాసు, కాళిదాసు తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ స్కూల్ యాజమాన్యం మండడి సుధాకర్ రెడ్డి, విజయలక్ష్మి, నూకల అశోక్ యాదవ్, ఎడెల్లి రాములు, మాచర్ల మల్లేశం, ఉభయ రాష్ట్రాల పలువురు కవులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-కొండపాక

ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. టిఎస్ యూటిఎఫ్ కుకునూరుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో తరగతి కి ఒక ఉపాధ్యాయుని నియమించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. తద్వారా ఉన్నత పాఠశాలలో సైతం విద్యార్థుల నమోదు శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మేనిఫెస్టోలో ఇచ్చిన హామి ప్రకారం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రమోషన్లు కల్పించి బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ , మండల అధ్యక్షులు శివుడు, ప్రధాన కార్యదర్శి రాజనర్సింహలు,జిల్లా నాయకులు చేర్యాల రాంచంద్రం, ప్రవీణ్ కుమార్, రాంచంద్రం ఉన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బెజ్జంకి



అయోధ్య బాలరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా రాముడు, సీత, లక్ష్మణుడి ప్రతిమలతో శోభాయాత్ర నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రధాన వీదులగుండా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వరకు ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యేక శోభాయాత్ర నిర్వహించారు.సర్పంచ్ ద్యావనపల్లి మంజుల, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావు శోభాయాత్రలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.అయా గ్రామాల్లోని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాముడు, లక్ష్మణుడు, హనుమాన్, మహర్షి వేషధారణలు, మహిళల కోలాటం శోభాయాత్రలో ప్రత్యేకార్షణగా నిలిచాయి. సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేడుకలు

నవతెలంగాణ-నంగునూరు



అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం, బలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఐదు శతాబ్దాల కల సాకారమైన వేళ భక్తులు కాషాయ జెండాలను పట్టుకొని జైశ్రీరామ్ నినాదాలతో బైక్ ర్యాలీ, పల్లకీ ఊరేగించారు. శోభాయాత్ర నిర్వహించారు. పాలమాకుల, రాజగోపాల్ పేట, నర్మెట అక్కెనపల్లి తదితర గ్రామాల్లో సీతరాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయగా అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు,పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం మనందరికీ శుభదాయకం, ఆనందదాయకం, సంతోషకరమన్నారు. అనంతరం శ్రీ రామాలయం, హనుమాన్ దేవాలయం, శ్రీ కాశీ మరకత శివాలయం, దేవాలయాలతో పాటు అంబేద్కర్ చౌరస్తా, లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి , కౌన్సిలర్లు బోజు రమ రవీందర్, చిత్తారి పద్మ, వాలా సుప్రజా నవీన్ రావు వల్లపు రాజు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, పున్న సది, ఐలేని శంకర్ రెడ్డి, ఐలేని శ్రీనివాస్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఊరూరా పండుగ వాతావరణం

నవతెలంగాణ-మద్దూరు



అయోధ్యలో రామ మందిరం నిర్మించి శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మద్దూరు, దూల్మిట్ట మండలంలోని అన్ని గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయాలను పూలతో ముస్తాబు చేసి. రామ సంకీర్తనలు చేశారు.అదేవిధంగా గాగిల్లాపూర్, మద్దూరు గ్రామాలలో భక్తులకు శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు. ప్రజా ప్రతినిధులు కమిటీ సభ్యులు ప్రొజెక్టర్లను ఏర్పాటు చేశారు.మద్దూరు మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మారెళ్ళ భాస్కర్ రెడ్డి, 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు,ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కమిటీ సభ్యులు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు

రజక సంఘం రాష్ట్ర చైర్మన్ బస్వరాజ్‌శంకర్‌ను కలిసిన జిల్లా నాయకులు

నవతెలంగాణ-సిద్దిపేట



ఇటీవల తెలంగాణ రాష్ట్ర రజక సంఘం చైర్మెన్‌గా ఎన్నికైన బస్వరాజు శంకర్‌ను కరీంనగర్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, సిద్దిపేట రజక మీడియా మిత్రులు విజయ్ గణేష్, రమేష్ పోతరాజు, చిట్టాపూర్ ఎంపీటీసీ బొల్లారం కనకరాజు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణా లో ఇన్ని రోజులుగా అణచివేయబడుతున్న రజక జాతి అభ్యున్నతికి కృషి చేస్తానని, అన్ని సంఘాలను ఒకే తాటిపైకి తెచ్చి ఐక్యతను చాటుకుంటామని బస్వరజ్ శంకర్ అన్నట్లు తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-మిరు దొడ్డి



దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో, హాస్టల్స్‌లో భారత రాజ్యాంగం గణతంత్ర దినోత్సవంపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తుమ్నామని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ అన్నారు. సోమవారం దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్ మాట్లాడుతూ జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవం గురించి భారత రాజ్యాంగం గురించి సోమవారం మిరు దొడ్డి మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు రాజ్యాంగం పై ప్రతి ఒక్కరు అవగహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు

శ్రీరాముడికి అభిషేకం చేసిన రామరాజు

నవతెలంగాణ-గజ్వేల్



అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో 50 కోట్ల లిఖిత రామ నామాలతో అద్దాల మందిరం వద్ద సోమవారం శ్రీరామునికి ప్రత్యేకంగా అభిషేకం చేశారు. సంస్థ అధ్యకులు రామకోటి రామరాజు. దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామ అంటే రోమా రోమాన్ని మై మరపించే మహా మంత్రం రామ మంత్రం అన్నారు. శాశ్వత మైనది రామ నామమే అన్నారు. ప్రతి ఒక్కరు రామకోటి లిఖించి తరించాలన్నారు.

అల్వాలలో అన్నదానం

నవతెలంగాణ-మిరు దొడ్డి



అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో 2001 పదవ తరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో గ్రామంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం నిర్మాణం ఎంతో గర్వకారణం అన్నారు. రామాలయం దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, ప్రకాష్, నరేష్, యాదగిరి, మల్లేశం, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి మైక్‌సెట్ అందజేత

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని రేబర్తి గ్రామంలోని రామాలయానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకులు మారెళ్ళ భాస్కర్ రెడ్డి సోమవారం మైక్ సెట్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రామాలయానికి తనవంతుగా రూ.32 వేలతో మైక్‌సెట్టు అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆలయానికి మైక్ సౌండ్ సెట్ ను అందించిన మారెళ్ళ భాస్కర్ రెడ్డి,దంపతులను భజన మండలి సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు

బాల రాముడు ప్రాణ ప్రతిష్ఠలో సిద్దిపేట డాక్టర్ అరవింద్ కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట



అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి సిద్దిపేటకు చెందిన ప్రముఖ దంత వైద్యులు అరవింద్ కుమార్ హాజరయ్యారు. రామ మందిరం ప్రారంభోత్సవానికి డాక్టర్‌కు ప్రత్యేకంగా ఆహ్వానం అందింది. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రాముడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగస్వామినయ్యే అరుదైన అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. అయోధ్యలో కన్నుల పండుగ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయనీ, రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ రామ మందిరాన్ని దర్శించుకోవాలని కోరారు.